అక్రమ కట్టడాలతో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు

చర్యలు తీసుకోవాలని వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతి


వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి, కొండాపూర్ డివిజన్ల పరిధిలో అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి శనివారం బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవికుమార్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఇష్టానుసారంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాల వల్ల తలెత్తుతున్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలతో ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఖాళీ స్థలాల్లో పుట్టుకొస్తున్న వ్యాపార సముదాయాలను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, వసంత్ కుమార్ యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్.. అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం


కాలిపోయిన సామగ్రి


కృష్ణవేణిని తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మియాపూర్: షార్ట్‌సర్క్యూట్ కారణంగా అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో మంటలు రేగడంతో ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ గోకుల్ ఫ్లాట్స్‌లోని వెంకటరమణ కాలనీలో ఎస్అండ్ఎస్ హోమ్స్ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో మోహన్‌దాస్ ,కృష్ణవేణి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. శనివారం కుమారుడు గిరిధర్ ఉద్యోగానికి వెళ్లగా ఇద్దరు ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో హాల్‌లో ఉన్న ఏసీ నుండి పొగలు వచ్చి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే మంటలు వ్యాపించడంతో హాల్‌లో ఉన్న మోహన్‌దాస్ బయటకు వచ్చాడు. భార్య కృష్ణవేణి బాల్కనీలో ఉండిపోయింది. స్థానికులు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కూకట్‌పల్లి అగ్నిమాపక సిబ్బంది 6 నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కృష్ణవేణిని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. ఇంట్లో ఉన్న సామగ్రి, పత్రాలు కాలిపోయాయి. కిచెన్‌లోకి మంటలు వ్యాపించేలోపు అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్తీ అయితే కఠిన చర్యలే..

- చిన్నచిన్న టిఫిన్ సెంటర్ల నుంచి రెస్టారెంట్ల వరకు తనిఖీలు చేస్తున్నాం
- చందానగర్ సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారి హృదయ



నాణ్యత లేని ఆహారం అనిపిస్తే సమాచారం ఇవ్వండి

చందానగర్: నగరంలో కల్తీ ఆహారంతో అస్వస్థత, మరణాలు సంభవిస్తున్నాయి. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేసినా ఎక్కడో ఒకచోట సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఆహారం తయారు చేసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. బిజీ లైఫ్‌లో ఎపుడో ఒకసారి హోటళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీనికితోడు ఇళ్ల వద్దకే ఫుడ్ నిమిషాల్లో డెలివరీ చేస్తుండడంతో ఆర్డర్లు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో వ్యాపారులు నాసిరకమైన పదార్థాలతో తయారుచేస్తుండడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో అధికారులు హోటళ్ల తనిఖీలు చేపట్టారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చందానగర్ సర్కిల్– 21 ఫుడ్ సేఫ్టీ అధికారి హృదయ పేర్కొన్నారు. బయట ఆహార పదార్థాలు తీసుకునే ముందు ఆలోచించాలన్నారు. ఆకర్షణీయంగా కనపడడానికి ఫుడ్ కలర్ వాడుతున్నారని అలాంటి పదార్థాల జోలికి వెళ్లకుండా ఉండడం సురక్షితమని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నా రు. కల్తీ అనిపిస్తే వెంటనే ఆహార భద్రత సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ నేపథ్యంలో సాక్షి ఇంట ర్వ్యూలో ఆమె పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: చందానగర్ సర్కిల్ పరిధిలో ఎన్ని హోటల్స్ ఉన్నాయి. తనిఖీలు చేస్తున్నారా?

జ: చందానగర్ సర్కిల్– 21 పరిధిలో 1800 హోటల్స్, రెస్టారెంట్లు ఉన్నాయి. వాటిని నిరంతరం ప్రత్యేక టీంల ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న: కల్తీ ఆహార పదార్థాలను ఎలా గుర్తించాలి ?

జ: రంగు మారినా, రుచి మారిన పదార్థాలను కల్తీ లేదా కుళ్లినట్లు గుర్తిస్తాం. వాటిని నాచారంలోని ల్యాబ్‌కు పంపించి రిపోర్టు వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటాం. మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారు. సమాజం బాగుంటుంది.

ప్రశ్న: కల్తీ లేదా అపరిశుభ్రత, పాడైన ఆహార పదార్థాలు ఉంటే కేసులు నమోదు చేస్తారా ?

జ: చందానగర్‌లో వివిధ రెస్టారెంట్‌లు, చిన్న చిన్న టిఫిన్ సెంటర్లలో తనిఖీలు చేస్తున్నాం. కుళ్లిన, అపరిశుభ్రంగా ఉన్నా, కల్తీ ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నోటీసులు అందించి, జరిమానాతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదయ్యాయి.. ఎంత జరిమానా విధించారు ?

జ: చందానగర్ సర్కిల్ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న 30 హోటళ్లపై కేసులు నమోదు చేశాం . అందులో 21 హోటల్స్‌కు రూ.9.20 లక్షలు జరిమానా విధించాం.

ప్రశ్న: కల్తీపై ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు ?

జ: చందానగర్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు కల్తీ ఆహారంపై దినపత్రికలు చూపుతూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. హోటళ్లలో ఆహారంపై ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే ఫిర్యాదు చేయమని సూచించాం.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ, మాధవీహిల్స్, వెంకటరమణ టాటామోటార్స్ లేన్, హైటెన్షన్ టవర్స్ లేన్, జేవీజీహిల్స్, శిల్ప వ్యాలీ, సెంట్రల్‌పార్క్ ఫేజ్–2, గాయత్రి లేఅవుట్, కాంతివనం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: వైద్య చికిత్స నిమిత్తం శేరిలింగంపల్లివాసులు ఆరుగురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.3.60 లక్షల చెక్కులను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ శనివారం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ



రాయదుర్గం: అయ్యప్పస్వామి నామస్మరణతో గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం మారుమోగింది. శనివారం నిర్వహించిన మహా పడిపూజలో భాగంగా పంచామృతాభిషేకం, పదునెట్టాంబడిపై దీపాలు వెలిగించి అంగరంగవైభవంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి మాజీ శాసనసభ్యుడు భిక్షపతియాదవ్, బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పూజలో పాల్గొన్నారు.

నేడు కార్తీక వన భోజనాలు

ఆల్విన్‌కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్యుల వన భోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు మియాపూర్‌లోని ధర్మపురి క్షేత్రంలో జరిగే కార్యక్రమానికి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శెట్టి బలిజ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కేపీహెచ్‌బీ కాలనీ, 3వ ఫేజ్ బస్టాండ్ వద్ద, కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం శెట్టి బలిజ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఓ ప్రకటన విడుదల చేశారు.

గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో..

వివేకానందనగర్ కాలనీలోని చిత్తారమ్మ దేవాలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌడ సంఘీయుల వన భోజన మహోత్సవం ఉంటుందని కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

టీవర్క్స్‌లో 'కాఫీ టేబుల్ బుకింగ్'



మెమెంటోలను అందిస్తున్న టీవర్క్స్ సీఈఓ జోగేందర్, టీజీఐసీ స్టేట్ ఇన్నోవేషన్ ఆఫీసర్ అజిత్ రంగ్నేకర్ తదితరులు

చందానగర్: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ఆవిష్కర్తలకు ఆర్థిక సహాయం అందించేందుకు జపాన్ దేశానికి చెందిన జైకా (జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ)సంస్థ ముందుకొచ్చిందని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ తెలిపారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ ప్రాంగణంలో శనివారం 'కాఫీ టేబుల్ బుకింగ్' పేరిట గ్రామీణ ఇన్నోవేటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ జైకా సంస్థ రూ.1700 కోట్లు కేటాయించేందుకు ముందుకొచ్చిందన్నారు. ఈ నిధులతో ప్రాజెక్టులను ఉత్పత్తి స్థాయికి ఎదిగేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఇన్నోవేషన్ 101 పుస్తకావిష్కరణ చేశారు. ఇన్నోవేటర్లు, ఆవిష్కరణల వివరాలను తెలిపేలా రూపొందించిన ఇన్నోవేషన్ 101 పుస్తకాన్ని టీవర్క్స్‌లో సీఈఓ జోగేందర్, పల్లె సృజన ఫౌండేషన్ అధ్యక్షుడు బ్రిగేడర్ గణేష్, టీజీఐసీ స్టేట్ ఇన్నోవేషన్ ఆఫీసర్ అజిత్ రంగ్నేకర్, 101 ఇన్నోవేటర్స్, కోఆర్డినేటర్ల సమక్షంలో ఆవిష్కరించారు.

లయన్స్ క్లబ్ చేయూత

చందానగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ ఓ నిరుపేద విద్యార్థికి ఆర్థిక చేయూతనిచ్చింది. శనివారం చందానగర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ కార్యాలయంలో 7వ తరగతి విద్యార్థి సాయికృష్ణకు రూ.20వేల చెక్కును అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్ ప్రవీణ్‌రెడ్డి, బర్ల మల్లేష్ యాదవ్, గుర్రం భాస్కర్, రవీందర్, విష్ణు, భగవాన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాస్‌ను వినియోగంలోకి తెస్తాం


చందానగర్ రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: చందానగర్ రైల్వే అండర్‌పాస్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్పష్టం చేశారు. చందానగర్ రైల్వే అండర్‌పాస్‌ను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు అండర్‌పాస్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం అండర్ పాస్ వద్ద నీటి తొలగింపు పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ భాస్కర్‌తో ఆయన పర్యవేక్షించారు. సమస్య మళ్లీ తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాపిరెడ్డి కాలనీవాసులు, నాయకులు వీరేశంగౌడ్, కొండల్‌రెడ్డి, రాంబాబు, శ్రీకళ, లింగారెడ్డి, బస్వరాజ్, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కుమారి, సుధారాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో పర్యటించిన కార్పొరేటర్

శేరిలింగంపల్లిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, సీనియర్ నాయకులు డి.వీరేశం గౌడ్, వార్డు మెంబర్ శ్రీకళా వెంకటేశ్వర్లు, నాయకులు బసవరాజు, కుమారి, సుధారాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని డాక్టర్ ప్రీతిశర్మ అన్నారు. మాదాపూర్‌లోని మెరిడియన్ స్కూల్‌లో శనివారం ఉత్కర్ష్ పేరిట వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ప్రీతిశర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి జీవితంలో క్రమశిక్షణ అవసరమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో మెరిడియన్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు బుట్టా రేణుక, స్కూల్ ప్రెసిడెంట్ లలితానాయుడు, సీఈఓ తేజస్వీని, సీఓఓ అమోఘ్ బుట్టా, ప్రిన్సిపల్ కరణం భవాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు విద్యలో భాగం కావాలి


బెలూన్ ఎగురవేస్తున్న అథ్లెట్ నందిని, స్కూల్ యాజమాన్యం

ఇండియన్ అథ్లెట్ నందిని అగసర

గచ్చిబౌలి: క్రీడలు చదువులో భాగం కావాలని ఇండియన్ అథ్లెట్ నందిని అగసర, వింగ్ కమాండర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో ది క్రీక్ ప్లానెట్ స్కూల్ వార్షిక క్రీడోత్సవాలను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక దారుఢ్యంతో పాటు పట్టుదల, క్రీడాస్ఫూర్తిని పెంచుతాయని పేర్కొన్నారు. టేబుల్ టెన్నిస్, రన్నింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్, చెస్, కబడ్డీ, ఫుట్‌బాల్, త్రోబాల్, వాలీబాల్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బొల్లినేని శ్రీనయ్య, వైస్ చైర్మన్ పాండురంగాచారి, డైరెక్టర్ నరేంద్ర ప్రసాద్, అకడమిక్ హెడ్ డాక్టర్ జయశ్రీ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు పనులు, సీవరేజ్ పైపులైన్ పనుల్లో నాణ్యత పాటించాలని, అలాగే పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అన్నారు. శనివారం వివేకానందనగర్ డివిజన్‌లోని వేంకటేశ్వరనగర్, మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్ వద్ద, వేంకటేశ్వరనగర్ రోడ్డు నంబర్ 14లో, రిక్షాపుల్లర్స్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు, మురుగునీటి పైపులైన్ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శ్రావణి, వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రియాంక, స్థానిక నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింహులు, రమేష్ రావు, సోమేష్, వెంకటేశ్వరరావు, శ్యామ్, రామచందర్, నరేష్, మహేష్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి లివర్ కేర్ వైద్యసేవలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, వైద్యాధికారులు

రాయదుర్గం: లివర్ అనేది మన శరీరంలో ముఖ్యమైన భాగమని జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రఖ్యాత సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. శనివారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో స్టార్ ఆస్పత్రిలో లివర్ సంరక్షణ, ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'స్టార్ లివర్ ఇన్‌స్టిట్యూట్'ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నూతన కేంద్రం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నెం గోపీచంద్, మెంటార్ డాక్టర్ రవీంద్రనాథ్, డైరెక్టర్ డాక్టర్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ గూడపాటి మాట్లాడుతూ స్టార్ లివర్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ప్రజలకు ప్రపంచస్థాయి లివర్ కేర్ అందించడంతో పాటు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో అత్యున్నత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని వారు వివరించారు. అనంతరం సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని ఆస్పత్రి డాక్టర్లు ఘనంగా సత్కరించారు.

హెచ్‌సీయూలో జరిమానాలపై విద్యార్థుల ఆందోళన

తోపులాటలో కిందపడిన చీఫ్ వార్డెన్


హెచ్‌సీయూలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిపాలనా భవనం ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. క్యాంపస్‌లో విద్యార్థుల వసతి గృహాలను తనిఖీ చేయడానికి నియమించిన ప్రత్యేక స్క్వాడ్ తనిఖీలు చేసి ఇష్టానుసారంగా ఫైన్ విధించడం పట్ల విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం హాస్టళ్లను తనిఖీ చేసేందుకు చీఫ్ వార్డెన్ సువశిశ రాణా, ఇతర అధికారులు రావడంతో విద్యార్థులు వారిని వ్యతిరేకించారు. అనంతరం వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చీఫ్‌వార్డెన్ అక్కడి నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తోపులాటలో చీఫ్ వార్డెన్ స్పృహతప్పి పడిపోయారు. దీంతో వెంటనే అలర్ట్ అయిన సెక్యూరిటీ సిబ్బంది ఆయన్ని క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ మాజీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు అతీక్ అహ్మద్, విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ చిన్న చిన్న అంశాలకు భారీ జరిమానాలను విద్యార్థులకు విధించడం అన్యాయమన్నారు. అనంతరం వారంతా అక్కడి నుంచి చీఫ్ వార్డెన్ కార్యాలయానికి వెళ్లి నిరసన తెలిపారు. ఈ విషయమై గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ హెచ్‌సీయూ అధికారుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. కాగా సోమవారం సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టినట్టు మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అపరిశుభ్రతకు తావు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యంపై కదం తొక్కిన ప్రజలు

- దుమ్ము, ధూళితో ఆరోగ్య సమస్యలు
- భారీ వాహనాలతో రోడ్లు ఛిద్రం
- ఆర్ఎంసీ ప్లాంట్లను తొలగించాలని డిమాండ్
- ఆందోళనకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సంఘీభావం


మైహోం అవతార్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న గేటెడ్ కమ్యూనిటీవాసులు

మణికొండ: 'కోట్లాది రూపాయలు వెచ్చించి ఫ్లాట్‌లు, విల్లాలు కొనుగోలు చేసి హాయిగా జీవిద్దామని వస్తే కాలుష్యంతో అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం... రణగొణ ధ్వనులతో తలుపులు మూసుకుని జీవించాల్సి వస్తుంది... అధికారులు ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.. అందుకే రోడ్డెక్కాల్సి పరిస్థితి నెలకొంది' అని నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల సరిహద్దులోని మైహోం అవతార్, హాల్ మార్క్ వినిసియా గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు ఆక్రోశం వెలిబుచ్చారు.

- శనివారం వారు గచ్చిబౌలి–నార్సింగి ఔటర్ సరీస్ రోడ్డు పక్కన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన ఆర్ఎంసీ ప్లాంట్లు నిబంధనలకు విరుద్ధంగా పక్కనే ఏర్పాటు చేయటం ఏమిటని ప్రశ్నించారు.
- ప్లాంట్ల వాహనాలు తిరిగి రోడ్లు ఛిద్రం కావటంతో స్కూల్ బస్సులు రాక వందలాది మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తమ సమస్య వినిపించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోయారు.
- ఇకనైనా ప్రభుత్వం స్పందించి రెడీమిక్స్ ప్లాంట్లను దూరంగా తరలించాలని, లేదంటే రాబోయే రోజుల్లో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
- ఆందోళనకారుల డిమాండ్ సహేతుకమైనదని, ప్రభుత్వం స్పందించి ఆర్ఎంసీ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అభిప్రాయపడి వారికి సంఘీభావం తెలిపారు.
- రాష్ట్రానికి అత్యధిక ఆదాయం సమకూర్చి పెట్టే ఐటీ జోన్ పక్కనే రూ. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన గృహాలలో ప్రజలు నివసించ లేని పరిస్థితి ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గండిపేట మండలంలోనే ఒక్క రెడీమిక్స్ ప్లాంట్ లేకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే రాబోయే రోజుల్లో పదివేల మందితో ఆందోళన చేస్తాం.
- రాష్ట్రంలోనే అత్యంత విలువైన ప్రాంతంలో ప్రజలు సుఖంగా నివసించే అవకాశం లేదంటే ఇక హైదరాబాద్‌లో ప్రజల జీవనాన్ని అర్థం చేసుకోవచ్చని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో వట్టినాగులపల్లిలో క్రషర్‌లతో ప్రజలు ఇబ్బంది పడి ఆందోళన చేపడితే కంటితుడుపు చర్యగా కొన్ని రోజులు మూసివేసి తిరిగి తెరిపించారన్నారు. ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

ముగిసిన సత్యసాయి జయంతి వేడుకలు

రాయదుర్గం: సత్యసాయి సేవా సమితి గచ్చిబౌలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం ముగిశాయి. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో ఉదయం ప్రత్యేక భజనలు, పల్లకిసేవ, నగర సంకీర్తనలు, అభిషేకాలు, సామూహిక సత్యసాయి వ్రతాలు, 24 గంటల అఖండ నామసంకీర్తన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులతో సామూహిక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించవద్దు

డీఎల్‌పీఓ అనిత

పటాన్‌చెరుటౌన్: అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, నోటీసులు ఇచ్చినా వినకుండా నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామని డీఎల్‌పీఓ అనిత హెచ్చరించారు. శనివారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, కార్యదర్శి సుభాష్‌లతో కలిసి గ్రామంలో పర్యటించారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పాత మార్కెట్, పోలీస్‌స్టేషన్ నుండి గౌతంనగర్ వరకు రూ .2 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. రోడ్డు మధ్యలో జంక్షన్ల వద్ద నీటి పైపులకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. అనంతరం పటాన్‌చెరులోని బండ్లగూడ, నేతాజీనగర్, బాలాజీనగర్‌లో స్థానిక కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.